విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
5-1-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 124

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# కృష్ణా నీళ్లపై అసత్యాల రాజకీయం



- ప్రాజెక్టులపై నిర్లక్ష్యానికి కాంగ్రెస్ కుట్రే కారణం: హరీశ్‌రావు
- అసెంబ్లీలో సీఎం చెప్పింది వాస్తవాలు కావని బీఆర్ఎస్ ఆరోపణ
- తెలంగాణ జలహక్కులను తాకట్టు పెట్టిందని కాంగ్రెస్‌పై విమర్శలు
- పాలమూరు, నల్లగొండకు అన్యాయం జరిగినదీ విభజన కాలంలోనేనన్న వాదన
- కృష్ణాగోదావరి అంశాల్లో లోపాయికారి ఒప్పందాలపై అనుమానాలు
- ప్రాజెక్టుల నిర్వాహణలో కక్షపూరిత వైఖరి ఉందన్న ఆరోపణ
- కాంగ్రెస్ పాలన వల్లే నేటి నీటి సమస్యలంటూ విమర్శ

హైదరాబాద్, జనవరి 4: కృష్ణా జలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వాస్తవాలను వక్రీకరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు నష్టం కలిగించిన నిర్ణయాల వెనుక కాంగ్రెస్ పాత్రే ఉందని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ భవన్‌లో కృష్ణా జలాలపై బీఆర్ఎస్ నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో తీసుకున్న నిర్ణయాలతోనే తెలంగాణకు అన్యాయం జరిగిందని, కీలక ప్రాజెక్టులకు చట్టపరమైన రక్షణ కల్పించడంలో అప్పటి పాలకులు విఫలమయ్యారని చెప్పారు. పాలమూరురంగారెడ్డి, డిండి వంటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ తన తప్పులను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం కాళేశ్వరం సహా ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుల అమలును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ రైతుల ప్రయోజనాలను పక్కనపెడుతోందన్నారు. కాంగ్రెస్ పాలన కాలంలో పరిమిత ప్రాంతాలకు మాత్రమే నీరు అందిందని, బీఆర్ఎస్ హయాంలో సాగునీటి విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని

(మిగతా 2వ పేజీలో)

## గోదావరి జలహక్కుల పరిరక్షణకు
# తెలంగాణ న్యాయపోరాటం

- గోదావరిపై ఏపీ విస్తరణ యత్నాలకు అడ్డుకట్టే లక్ష్యంగా చర్యలు
- సర్వోన్నత న్యాయస్థానంలో తెలంగాణ రిట్‌పై కీలక విచారణ
- న్యాయపరంగా బలమైన వాదనలు వినిపించాలని నిపుణులకు సూచన
- అనుమతుల్లేని పనులు తక్షణమే నిలిపివేయాలన్న డిమాండ్
- కేంద్ర సంస్థలు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్న విజ్ఞప్తి
- తెలంగాణ ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యం : సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 4:గోదావరి నదిలో తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దృఢమైన చర్యలకు సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు నీటి తరలింపు యోజనను అడ్డుకునేందుకు న్యాయపోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానంలో సోమవారం

(మిగతా 2వ పేజీలో)



# గడువు దాటాకైనా జాడ ఉండాలి!
## మావోయిస్టుల తాజా ఎత్తుగడ

- మార్చి 31 తర్వాత కూడా ఉనికిని చాటాలన్న లక్ష్యం
- నిర్మూలన అసాధ్యమని ప్రభుత్వానికి సవాల్ విసిరే యత్నం
- దళాల్ని కొత్త ప్రాంతాలకు తరలిస్తున్న అగ్రనేతలు
- తిప్పిరి తిరుపతి నేతృత్వంలో కదులుతున్న బృందాలపై నిఘా
- తెలంగాణకు చెందిన కీలక నేతలు లొంగుబాటుకు విముఖత
- డెడ్‌లైన్ ముగిసేవరకు బతుకుదెరువు వ్యూహం

హైదరాబాద్, జనవరి 4:నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్చి 31 గడువు దాటిన తర్వాత కూడా తమ ఉనికిని నిలుపుకోవాలనే లక్ష్యంతో మావోయిస్టు పార్టీ కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోందని నిఘా వర్గాలు గుర్తించాయి. గడువు అనంతరం

(మిగతా 2వ పేజీలో)

## విధ్వంస రాజకీయాలకు
# ప్రతీకగా కేటీఆర్

- బీఆర్ఎస్ పాలన తెలంగాణను వెనక్కి నెట్టింది: మహేశ్‌గౌడ్
- అధికార అహంకారంతో కేటీఆర్ వ్యవహారమన్న టీపీసీసీ చీఫ్
- బంగారు తెలంగాణను భ్రష్టుపట్టించిందీ బీఆర్ఎస్‌నేనన్న ఆరోపణ
- నిరుద్యోగుల శాపమే బీఆర్ఎస్ పతనానికి కారణమన్న వ్యాఖ్య
- కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో ఉందన్న స్పష్టం
- అవినీతి అంశాల నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ ప్రకటనలంటూ విమర్శ
- ప్రజలే ఇప్పటికే తీర్పు చెప్పారని హెచ్చరిక




హైదరాబాద్, జనవరి 4:బీఆర్ఎస్ నాయకత్వం విధ్వంస రాజకీయాలకు ప్రతిరూపంగా మారిందని, అందులో కేటీఆర్ అహంకారం పరాకాష్టకు చేరిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణను అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన బాధ్యత పూర్తిగా బీఆర్ఎస్‌పైనే ఉందని ఆయన వ్యాఖ్యానించారు.నిరుద్యోగుల ఆవేదన, ప్రజల ఆగ్రహమే బీఆర్ఎస్ పార్టీని ఈ స్థితికి తీసుకొచ్చిందని

(మిగతా 2వ పేజీలో)




## తెలంగాణకు
# నీటిశాపంగా మారిన సీఎం

### అవగాహనలేని పాలనతో రాష్ట్రాన్ని ముంచుతున్న రేవంత్

- నదీజలాలపై కనీస అవగాహన కూడా లేదన్న ఆరోపణ
- అసెంబ్లీలో వాస్తవాలు వక్రీకరించారని తీవ్ర విమర్శ
- తెలంగాణకు తరతరాలుగా నష్టం చేసింది కాంగ్రెస్‌నేనన్న వ్యాఖ్య
- కేసీఆర్‌పై దూషణలు అధికార అహంకారానికి నిదర్శనమన్న కేటీఆర్
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణ
- నీటి వివాదాలపై ప్రజలకు నిజాలు చెప్పేందుకే బీఆర్ఎస్ ప్రయత్నం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 4: నదీజలాల అంశంపై అవగాహన లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, అదే తెలంగాణకు అతిపెద్ద ప్రమాదంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. బేసిన్లు, నీటి నిర్వహణపై ప్రాథమిక జ్ఞానం కూడా లేకుండానే అసెంబ్లీలో వ్యాఖ్యలు చేసి

(మిగతా 2వ పేజీలో)



## పోలీసు అధికారుల తీరుపై
# తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు
- ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు
- తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా

# గ్రోక్‌పై కేంద్రం సీరియస్.. 72 గంటల గడువు

- 'గ్రోక్' ఏఐతో అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై కేంద్రం సీరియస్
- ఎలాన్ మస్క్ 'ఎక్స్' యాజమాన్యానికి 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- చట్టవిరుద్ధ కంటెంట్‌ను తొలగిస్తున్నామని స్పష్టం చేసిన ఎక్స్
- నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తామన్న యాజమాన్యం




# మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన.. చర్చలతోనే పరిష్కారమని సూచన

- వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ ని మదురోను అరెస్ట్ చేసిన అమెరికా సైన్యం
- నార్కో టెర్రరిజం ఆరోపణలపై విచారణకు న్యూయార్క్‌కు తరలింపు
- తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ నియామకం
- వెనెజువెలా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం
- చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు



# తెలంగాణకు నీటిశాపంగా మారిన సీఎం



ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రాష్ట్రానికి తరతరాలుగా జరిగిన అన్యాయానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు.నదీజలాలపై చర్చ పేరుతో అసత్యాలను ప్రచారం చేస్తూ వాస్తవాలను దాచే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు నిజాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ తరఫున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని తెలిపారు. అధికార మదంతో సీఎం మాట్లాడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.తెలంగాణ వ్యవసాయానికి ఊపిరిపోసిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన నాయకుడిపై చిల్లర వ్యాఖ్యలు చేయడం ద్వారా సీఎం తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నారని అన్నారు. ఇలాంటి మాటలు వింటే తెలంగాణ వాదుల హృదయాలు మండిపోతున్నాయని పేర్కొన్నారు.దశాబ్దాల కాంగ్రెస్ పాలన, ఆ తరువాతి చంద్రబాబు ప్రభుత్వాల వల్లే తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని కేటీఆర్ గుర్తు చేశారు. పదేళ్లలో రాష్ట్ర రూపురేఖలు మార్చిన బీఆర్ఎస్ నాయకత్వాన్ని అవమానించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఆరు గ్యారెంటీలు, వందల హామీల అమలులో ప్రస్తుత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రానికి వ్యతిరేక శక్తులకు తోడ్పడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రిగా మారడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. విలువలు, సంస్కారం లేని రాజకీయ భాషను సీఎం ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.తాము కూడా ప్రతిస్పందించగల సామర్థ్యం ఉన్నా, రాజకీయ సంస్కారాన్ని పాటిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు జరిగిన నీటి అన్యాయానికి కాంగ్రెస్ పార్టీనే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తేల్చిచెప్పారు.

## మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన..

### చర్చలతోనే పరిష్కారమని సూచన

**వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసిన అమెరికా సైన్యం**

**నార్కో టెర్రరిజం ఆరోపణలపై విచారణకు న్యూయార్క్‌కు తరలింపు**

**తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ నియామకం**

**వెనెజువెలా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం**

**చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు**



వెనెజువెలా: వెనెజువెలాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా డెల్టా దళాలు శనివారం అరెస్ట్ చేశాయి. వెనెజువెలాలోని ఓ సైనిక స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని యుద్ధనౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించాయి. మదురోపై అమెరికా తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈ కేసులో మదురో భార్య, కుమారుడితో పాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.మదురో అరెస్ట్ నేపథ్యంలో వెనెజువెలా సుప్రీంకోర్టు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. దేశ సమగ్రత, పరిపాలనా కొనసాగింపునకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.వెనెజువెలా పరిణామాలపై భారత్ ఆందోళనఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనెజువెలాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.



## పోలీసు అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడదని ప్రశ్నించిన హైకోర్టు**

**ఏ నిబంధనలు, ఏ జీవో ఆధారంగా చేస్తున్నారో వివరాలు సమర్పించాలన్న హైకోర్టు**

**తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా**

తెలంగాణలో పోలీసుల చర్యలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీస్ అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ స్థాయి అధికారులు తమంతట తాముగా సెర్చ్ వారంట్లు జారీ చేస్తుండటాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని హైకోర్టు ఈ సందర్భంగా ప్రశ్నించింది. పిటిషనర్ విజయగోపాల్ వ్యక్తిగత హోదాలో వాదనలు వినిపిస్తూ.. సీఆర్పీసీ సెక్షన్ 93, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 47లను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు మాత్రమే ఉన్న అధికారాలను వినియోగిస్తూ కార్డన్ అండ్ సెర్చ్ పేరుతో తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. నేరస్థులు, అక్రమ వలసదారుల కోసం అంటూ సెర్చ్ వారంట్ లేకుండానే ఇళ్లలోకి ప్రవేశించి గుర్తింపు పత్రాలు అడుగుతున్నారని ఆరోపించారు.వాదనలు విన్న ధర్మాసనం, సీఆర్పీసీ లేదా బీఎన్ఎస్‌లోని ఏ నిబంధనలు, జీవోల ఆధారంగా పోలీసులు సెర్చ్ వారంట్లు జారీ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ప్రజాభద్రత నిమిత్తం పోలీసులు చేస్తున్న కృషిని అభినందించాల్సిందేనని వ్యాఖ్యానిస్తూ.. సెర్చ్ వారంట్లు జారీ చేసే అధికారం పోలీసులకు ఉందా లేదా అన్న అంశంపై ఆధారాలతో సహా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# తెలంగాణలో డ్వాక్రా బకాయిలపై సర్కార్ ఉక్కుపాదం.. కట్టకపోతే ఆస్తులు జప్తు!

**స్త్రీనిధి రుణ బకాయిలపై ప్రభుత్వం కఠిన నిర్ణయం**

**వసూళ్ల కోసం రెవెన్యూ రికవరీ చట్టం అమలుకు ఉత్తర్వులు**

**అప్పు కట్టని వారి ఆస్తులు జప్తు చేసి వేలం వేసే అధికారం**

**సభ్యురాలు కట్టకపోతే గ్రూప్‌లోని అందరిపైనా భారం**




హైదరాబాద్, జనవరి 4: తెలంగాణలో డ్వాక్రా సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా 'స్త్రీనిధి' ద్వారా రుణాలు పొంది, నెలవారీ వాయిదాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు కోసం ప్రభుత్వం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'రెవెన్యూ రికవరీ చట్టాన్ని' అమలు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.ఏమిటీ 'రెవెన్యూ రికవరీ' చట్టం?ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు ఈ చట్టాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగిస్తారు. దీని ప్రకారం రుణం చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసే అధికారం అధికారులకు లభిస్తుంది. ఇళ్లు, భూములు వంటి స్థిరాస్తులతో పాటు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని, వాటిని బహిరంగంగా వేలం వేస్తారు. ఆ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వం తన బకాయి కింద జమ చేసుకుంటుంది. ఈ చట్టం అమలుతో బకాయిదారులపై ఒత్తిడి పెంచి, వసూళ్లను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.జగిత్యాల జిల్లాలో తీవ్రమైన పరిస్థితిప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మందికి పైగా డ్వాక్రా సభ్యులు ఉండగా, వారికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 475 కోట్ల రుణాలు అందించింది. చాలామంది మహిళలు తమ వ్యాపారాల కోసం రూ. 30 వేల నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. అయితే, జిల్లాలో వసూలు కావాల్సిన రూ. 101 కోట్లకు గాను కేవలం రూ. 78 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. దాదాపు రూ. 23 కోట్లు మొండి బకాయిలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.ఒక్కరు కట్టకపోయినా అందరికీ చిక్కులు!ఈ చట్టంలో అత్యంత కీలకమైన అంశం ఒకటుంది. రుణం తీసుకున్న సభ్యురాలి పేరు మీద ఎలాంటి ఆస్తులు లేకపోతే, ఆ అప్పును తీర్చే బాధ్యత గ్రూప్‌లోని మిగిలిన సభ్యులపై పడుతుంది. అంటే, ఒకరు చేసిన పొరపాటుకు సంఘంలోని అందరూ బాధ్యత వహించాల్సి వస్తుంది. అవసరమైతే ఇతర సభ్యుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో, సంఘంలోని మహిళలు పరస్పర సహకారంతో సకాలంలో రుణాలు చెల్లించేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.ఇప్పటికే సెర్ప్, మెప్మా అధికారులు గ్రామాల్లో పర్యటించి బకాయిల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల నుంచి కూడా అనుమతులు రావడంతో, త్వరలోనే జప్తు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

## కృష్ణా నీళ్లపై అసత్యాల రాజకీయం

గణాంకాలు ప్రస్తావించారు.కృష్ణా జలాలపై గతంలోనే కేంద్రాన్ని నిలదీసినట్టు గుర్తు చేస్తూ, టెలిమెట్రీ వంటి వ్యవస్థలను అమలు చేయడంలో తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీలో ఎంపిక చేసిన సమాచారాన్నే చదువుతూ సభ్యులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై అనుమానాస్పద ఒప్పందాలు కుదిరాయని కూడా ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ దశాబ్దాల పాలన వల్లే నేటి నీటి వివాదాలు ఉత్పన్నమయ్యాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ నీటి వినియోగం, ప్రాజెక్టుల వేగవంతమైన నిర్మాణం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ కూడా మాట్లాడుతూ, నదీ జలాల విషయంలో కాంగ్రెస్ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. జలాలపై అవగాహన లేకుండానే ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారని, రాజకీయ దూషణలతో వాస్తవాలు మారవని వ్యాఖ్యానించారు.

## గోదావరి జలహక్కుల పరిరక్షణకు తెలంగాణ న్యాయపోరాటం

విచారణకు రానుంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం ముంబైలో ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో విస్తృతంగా చర్చించారు. కోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని, ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న విస్తరణ చర్యలను స్పష్టంగా వివరించాలని సీఎం సూచించారు. సాంకేతిక అంశాలపై పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కూడా ఆదేశించారు.పోలవరం ప్రాజెక్టుకు మొదట అనుమతించిన రూపకల్పనను మార్చి, నల్లమల సాగర్‌కు లింక్ చేసే ప్రయత్నాలు చట్ట విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. అనుమతులు లేకుండానే చేపడుతున్న ఈ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరింది. అలాగే తెలంగాణ అభ్యంతరాలను పక్కనపెట్టి కేంద్ర సంస్థలు ముందుకు సాగడం సరికాదని స్పష్టం చేసింది.కేంద్ర జలసంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు ఈ వ్యవహారంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, పర్యావరణ అనుమతులు గానీ, ఆర్థిక సహాయం గానీ అందకుండా చూడాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ నిర్ణయానికీ తాము ఒప్పుకోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ముంబై సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగివచ్చారు.

## గడువు దాటాకైనా జాడ ఉండాలి!

బయటకు వచ్చి తమను పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వానికి సాధ్యం కాదని ప్రకటించాలనే ఆలోచనతో పార్టీ అగ్రనాయకత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ఇటీవల లొంగిపోయిన కొందరు కీలక నేతల నుంచి అందిన వివరాల ఆధారంగా, మావోయిస్టు అగ్రనేతలు దళాల భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్నారని పోలీసులు అంచనా వేస్తున్నారు. భద్రతా బలగాలకు అందని ప్రాంతాల్లో తలదాచుకునేలా, పోలీసులు ఊహించని ప్రాంతాలకు తరలిపోవాలని దళాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.మార్చి 31లోపు 'ఆపరేషన్ కగార్'ను పూర్తి చేయాలనే లక్ష్యంతో భద్రతా బలగాలు అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్న నేపథ్యంలో, కొందరైనా మైదాన ప్రాంతాలకు చేరుకుని నమ్మకస్తుల సహాయంతో బతికి బయటపడాలని మావోయిస్టులు భావిస్తున్నట్లు సమాచారం. గడువు ముగిసిన తర్వాత మళ్లీ తలెత్తి సవాల్ విసరడమే ఈ వ్యూహం వెనుక ఉద్దేశమని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుతం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో మిగిలిన కొద్ది మంది మావోయిస్టులు సురక్షిత ఆశ్రయాల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. తెలంగాణకు చెందిన మావోయిస్టుల్లో సుమారు 17 మంది మాత్రమే మిగిలి ఉండగా, వారిలో ఎనిమిది మంది కీలక స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది.తాజా సమాచారం ప్రకారం తిప్పిరి తిరుపతి, బడే చొక్కారావు, ముప్పిడి సాంబయ్య, లోకేటి చందర్‌రావుల నాయకత్వంలో చిన్నచిన్న బృందాలు కదులుతున్నాయని నిఘా విభాగాలు అనుమానిస్తున్నాయి. కేంద్ర కమిటీలో ఉన్న తెలంగాణకు చెందిన నలుగురు నేతలు లొంగుబాటుకు సిద్ధంగా లేరన్న సమాచారం కూడా పోలీసులకు అందినట్లు తెలుస్తోంది.కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినటంతో పార్టీ ముఖ్యులు పరిమిత సంఖ్యలోనే సంచరిస్తున్నారని, తిప్పిరి తిరుపతితో కూడిన బృందంలో 20 మందికంటే ఎక్కువ మంది లేరని అంచనా. ఇదిలా ఉండగా, లొంగుబాటుకు ముందుకొచ్చే వారికి సహకరిస్తామని తెలంగాణ పోలీసులు ప్రకటించడంతో కొందరు మావోయిస్టులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

## విధ్వంస రాజకీయాలకు ప్రతీకగా కేటీఆర్

అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్‌నేనని గుర్తుచేశారు. తెలంగాణ కోసం పోరాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని దోపిడీకి గురిచేసిన వారిని ప్రజలు మరిచిపోరని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో రెండు సంవత్సరాల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. అయినా ఈ మార్పులు కేటీఆర్‌కు కనిపించకపోవడం ఆశ్చర్యమని ఎద్దేవా చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుల లోపాలపై ప్రశ్నలు ఎదురవుతాయన్న భయంతోనే బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఈ అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే కేటీఆర్ చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.ముందుగా తమ పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని, ఆ తర్వాతే కాంగ్రెస్‌పై విమర్శలు చేయాలని సూచించారు. ఎవరు శిక్షార్హులో ప్రజలే ఇప్పటికే ఎన్నికల్లో స్పష్టం చేశారని, అయినా మార్పు రాకపోతే ప్రజలు మరోసారి గట్టి తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

## గ్రోక్‌పై కేంద్రం సీరియస్.. 72 గంటల గడువు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్)కు భారత ప్రభుత్వం స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఎక్స్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ 'గ్రోక్' ద్వారా అశ్లీల, అసభ్యకర కంటెంట్ సృష్టి, వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించింది. దీనిపై 72 గంటల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేసింది.ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'గ్రోక్' లేదా ఎక్స్‌ఏఐకి చెందిన ఇతర సర్వీసులను దుర్వినియోగం చేసి అశ్లీల, నగ్న, అసభ్యకరమైన కంటెంట్‌ను హోస్ట్ చేయడం, ప్రచురించడం, షేర్ చేయడం వంటివి జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ నోటీసులో పేర్కొంది.కేంద్రం ఆదేశాలపై ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ కార్ప్' ఆదివారం స్పందించింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధమైన కంటెంట్‌కు, ముఖ్యంగా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (జూసావీ)కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటూనే ఉన్నామని తెలిపింది. అవసరమైతే స్థానిక ప్రభుత్వాలు, చట్ట అమలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని 'ఎక్స్ సేఫ్టీ' విభాగం వెల్లడించింది. చట్టవిరుద్ధ కంటెంట్ కోసం 'గ్రోక్'ను వాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని మస్క్ చేసిన పోస్టుకు 'ఎక్స్ సేఫ్టీ' బదులిచ్చింది.నిబంధనలు పాటించని పక్షంలో ఐటీ చట్టం,బీఎన్ఎస్, ఇతర చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రం హెచ్చరించింది. చట్టవిరుద్ధ కంటెంట్ కాకుండా 'గ్రోక్' సాంకేతిక, పాలనాపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను సమగ్రంగా సమీక్షించాలని కూడా ఎక్స్‌ను ఆదేశించింది. ఆదేశాలను పాటించకపోతే ఐటీ చట్టంలోని సెక్షన్ 79 కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోవాల్సి వస్తుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# ప్రభుత్వ రంగ సంస్థల్లో దోబీ పోస్టు రజకులకే కేటాయించాలి ? గోపి రజక

102 జీవోను అమలు చేయాలన్న కొల్లూరు లక్ష్మనారాయణ .. అధునాతన ధోబీ ఘాట్ ఏర్పాటు చేయాలన్న సంగెం రమేష్



**వరంగల్, జనవరి 04(ప్రభాత సూర్య):** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రజకుల జీవితాలు మారుతాయని ఆశపడ్డాం కానీ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లు అడియాశలైనాయని రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక వాపోయారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలోని వాసవి పంక్షన్ హాల్లో నర్సంపేట రజక సంఘం అధ్యక్షులు కొల్లూరు లక్ష్మనారాయణ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశానికి డాక్టర్ పొనుగోటి గోపాల్ ,రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇల్లందుల సాంబయ్య,తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , జిల్లా అధ్యక్షులు ఐలోని అభిషేక్ , ఈస్ట్ జోన్ కన్వీనర్ నార్లగిరి కుమారస్వామి, జిల్లా నాయకులు సంగెం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా రజక ఫెడరేషన్ ఏర్పాటు చేయకపోవడంతో రజక వృత్తిదారులకు అందవలసిన సంక్షమ పథకాలు అందకపోవడంతో వృత్తిదారులు అయోమయంలో పడ్డారని కాబట్టి తక్షణమే ఫెడరేషన్ చైర్మన్ ను ఏర్పాటు చేసి 1000 కోట్లు కేటాయించాలని ప్రజాసంక్షమ ప్రభుత్వం అని ప్రకటించిన ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని కోరారు. డివిజన్ అధ్యక్షులు కొల్లూరు లక్ష్మనారాయణ మాట్లాడుతూ దోబీ కాంట్రాక్టు రజకులకే కేటాయించాలని తీసుకొచ్చిన గత ప్రభుత్వం 102 జీవోను ఈ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. నర్సంపేటలో నూతనంగా నిర్మిస్తున్న 250 పడకల ప్రభుత్వ హాస్పిటల్లో , మెడికల్ కాలేజీ హాస్టల్ , గురుకుల హాస్టల్ వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో దోబీ కాంట్రాక్టు రజకులకే కేటాయించాలని అదేవిధంగా దోబీ పోస్టులు రజకులకే కేటాయించాలని వారన్నారు. ముఖ్యనాయకుల సమావేశానికి డివిజన్ గౌరవ అధ్యక్షులు రాయరాకుల సారంగపాణి, జిల్లా నాయకులు మామిడాల నర్సయ్య, జిల్లా గౌరవ సలహాదారులు గాదె భద్రయ్య,చెన్నరావుపేట మండల అధ్యక్షులు ఉప్పుల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి బర్ల యాకయ్య, దుగ్గొండి మండలం అధ్యక్షులు రాయరాకుల జాకీ, నర్సంపేట పట్టణ మాజీ అధ్యక్షులు ఐలోని శ్రీను, ప్రధాన కార్యదర్శి తరిగొప్పుల రమేష్, కమిటీ సభ్యులు కొల్లూరు భాస్కర్,చౌడారం బాలయ్య,గుడికందుల సదయ్య,నెల్లుట్ల సాంబయ్య,శివ,కొరండ్ల రాంచందర్, సంగెం రామచంద్రు,ఉప్పుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు

# వినియోగదారుల మన్ననలు పొందేలా సేవలు అందించాలి

## ఆధునిక టెక్నాలజీ ని వుపయోగించి అవకాశాలు పొందాలి

### ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత పోతు భాస్కర్

### ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్స్ ఫెరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**సూర్యాపేట/ ప్రభాత సూర్య:** వినియోగదారుల మన్ననలు పొందేలా ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్లు సేవలు అందించాలని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ గ్రాండ్ బాంకెట్ హాల్ లో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెరడరేషన్ (టిపిఈటిఎఫ్) 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను వారు డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన గృహాలు నిర్మించుకునే వారికి ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు వారి అభిరుచులకు అనుగుణంగా సేవలు అందించాలన్నారు. యాన్యువల్ మెయింటెనెన్స్ సేవలను అందించడం ద్వారా పెద్ద పెద్ద సంస్థలలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆధునిక టెక్నాలజీ ని ఉపయోగించి అవకాశాలు పెంచుకోవాలని అన్నారు. టెక్నిషిన్లు విద్యుత్ పనులు నిర్వహించే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంఘం సభ్యులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. తమకు ఏమైన కష్టం వస్తే తమను సంప్రదిస్తే తమ వంతు సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ జెడ్పిటిసి రాజేష్ నాయక్, తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెరడేషన్ జిల్లా అధ్యక్షులు తోట శ్రవణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఎస్ కె మహిముద్ అలీ, సలహాదారులు బరిశెట్టి శ్రీనివాస్, ఎస్ కె నబి, ప్రధాన కార్యదర్శి బరిశెట్టి సోమయ్య, సట్ల మధు, రమేష్, రవి, రామము, జానయ్య, సత్యనారాయణ, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.




# సమాజానికి ఉపాధ్యాయుడు దిక్సూచి

**సూర్యాపేట /ప్రభాత సూర్య :** సమాజానికి ఉపాధ్యాయుడు దిక్సూచి అని, విద్యావంతుల తయారీలో వారి పాత్ర ఎనలేనిదని తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బస్కూరి కె.పి కుమార్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్ ఎల్ కే టాలెంట్ స్కూల్లో జిల్లా అధ్యక్షులు పిల్లల మర్రి కళింగం ఆధ్వర్యంలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.మంచి సమాజం రూపొందాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ విద్యను బోధించే ఉపాధ్యాయులు దైవంతో సమానమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ప్రైవేటు ఉపాధ్యాయుడి జీవితం మాత్రం మారడం లేదు అని అన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రభుత్వ నియమ నిబంధనలు వర్తింప చేయాలన్నారు.తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పనిభారం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నిబంధనలు,చట్టాలు తెచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యం వారికి ఎలాంటి ఆదెరువు చూపకపోవడంతో వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బచ్చులకూరి జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి ఉపేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఇటుకుల సైదులు గైగుళ్ళ మహేష్ యాదవ్, కట్టంకురు లక్ష్మణ్ గౌడ్, ధరావత్ రవీందర్, మారపంగ వెంకటేశ్వర్లు, జిల్లా సంయుక్త కార్యదర్శి గాజుల లక్ష్మణ్, జిల్లా కోశాధికారి రాపర్తి నాగరాజు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల స్రవంతి, జిల్లా కార్యవర్గ సభ్యులు మందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# భరత్ నగర్ హరిహర క్షత్రంలో లక్ష తులసీ అర్చన

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్



**కూకట్ పల్లి, జనవరి 04 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలో గల భరత్ నగర్ హరిహర క్షత్రంలో ఆదివారం నిర్వహించిన లక్ష తులసీ అర్చన కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, వి.కే. రావు, పవన్ రెడ్డి, సాంబ శివారెడ్డి, మనోహర్ రెడ్డి, సాయిరెడ్డి, బళ్లారి విజయ్, సురేష్, నాగరాజ్, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మాజీ మేయర్ నీల గోపాల్ రెడ్డి కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు డివిజన్ నాయకులు

**కుత్బుల్లాపూర్, జనవరి 04 (ప్రభాత సూర్య) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, ప్రగతి నగర్ డివిజన్ (276) ప్రగతి నగర్ పరిధిలో గల ఎన్ఆర్ఐ కాలనీ, చందు లేఔట్ కాలనీ నాయకులు ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ నీల గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు గోపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, సందీప్, మెరుగు రమేష్, శివరామకృష్ణ, త్రిమూర్తులు, రాజేష్ గుప్తా, సాయి బాలాజీ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాన్ నారాయణపురం లో గ్రామసభ

### సర్పంచ్ అధ్యక్షతన మొదటి గ్రామ సభ



**సంస్థాన్ నారాయణపురం, జనవరి 04(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గ్రామ పంచాయతి కార్యాలయంలో ఉపాధి హామీ 16వ విడత సోషల్ అడిట్ గ్రామసభ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇందులో 01/04/2024 సంవత్సరం నుండి 31/03/2025 వరకు చేసిన పనులకు సంబందించి పనుల నాణ్యత,కూలీలు చేసిన పనులను కొలతల ప్రకారం జరిగినవి ఎంబి ప్రకారం పని జరిగింది. నేషనల్ మొబైల్ మనిటరింగ్ సిస్టమ్ ద్వారా హాజరు వేయడం వంటి విషయాల పైన చర్చించడం జరిగింది. ఉపాధి హామీ పథకశీ సంబంధించిన పనులను సక్రమంగా నడిపించే విధంగా చేసుకుందాం అని ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డ్ సభ్యులు సూర పెల్లి వెంకటేష్, మందుగుల బాలకృష్ణ, పందుల యాదగిరి, బాల్గురి శివ, పట్నం బాలకృష్ణ, సభవత్ రఘు, సింగం బిక్షపతి, కట్ల వనజ, చిలివేలు రమాదేవి శంకర్, నీళ్ల అనిత, చింతల శైలజ, సిరిపంగా ప్రశాంతి, మహమ్మద్ హలీమా, అధికారులు పంచాయతి సెక్రటరీ, బి.ఆర్. పి కాషాయ్య టి. ఏ సైదులు ఎఫ్.ఏ నర్సింహ్మా, నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్ రహిత ఎల్లమ్మబండ గా తీర్చిదిద్దుదాం

### బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్




**కూకట్ పల్లి, జనవరి 04 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ లో మేరా యువభారత్ సభ్యులు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ నేతృత్వంలో మత్తు పదార్థాల అవగాహన కొరకు యువ చైతన్య యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సబ్ ఇన్ స్పెక్టర్ అప్పారావు, నాయకులు రవీందర్ రావు, నర్సింగ్ యాదవ్, దుర్గ ప్రసాద్, జిల్లా గణేష్ కృష్ణం రాజు, స్రవంతి, సయ్యద్, మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ డ్రగ్ రహిత ఎల్లమ్మబండ గా తీర్చిదిద్దడానికి శాయశక్తుల కృషి చేస్తాం అన్నారు. గంజాయి మహమ్మారి వలన నిర్వీర్యం అవుతున్న యువత జీవితాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉన్నది అన్నారు. అలాగే యువత సేవ మార్గాన్ని ఎంచుకొని సమాజ సేవలో ముందుండటానికి ప్రయత్నం చేస్తే చెడు ఆలోచనల నుండి మంచి మార్గంలోకి రావచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రెహమాన్, యూత్ సభ్యులు రామకృష్ణ, సందీప్, సాయి కృష్ణ రెడ్డి, అశోక, నాగరాజు, కూకట్ పల్లి బీజేవైఎం డివిజన్ ప్రెసిడెంట్ రవి కుమార్ యాదవ్, సురేష్, చాంద్ పాషా, భరత్, శ్యాంసన్, సాయి, పెద్ద ఎత్తున యువత, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.





## పోగొట్టుకున్న భక్తుడి బంగారు ఉంగరాన్ని తిరిగి అందించిన సీఐ వెంకట్

### సిబ్బందిని అభినందించిన సీఐ వెంకట్

**సూర్యాపేట/ ప్రభాత సూర్య :** సూర్యాపేట పట్టణంలో స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని పోలీసులు చాకచక్యంగా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. జేజే నగర్‌కు చెందిన వర్రే వెంకటేశ్వర్లు ఆదివారం ఉదయం ఆలయంలో కొబ్బరికాయ కొడుతుండగా, అతని చేతికి ఉన్న 8 గ్రాముల ఉంగరం జారి పడిపోయింది. ఈ మేరకు బాధితుడి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా పిర్యాదుపై పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్ తక్షణమే స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు నరేందర్, నవీన్‌లను తక్షణమే ఆలయం వద్దకు పంపించారు. సీసీ కెమెరాలను క్షణ్ణంగా పరిశీలించి ఉంగరాన్ని గుర్తించి బాధితుడికి ఉంగరాన్ని అందజేసినట్లు సీఐ తెలిపారు. పోలీసుల వేగవంతమైన స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నిజాయితీగా పనిచేసిన సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బాధితుడు సిఐకు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి మాతృదేవోభవ అనాధ ఆశ్రమం సహాయం



**సంస్థాన్ నారాయణపురం, జనవరి 04(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నోముల లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి కుటుంబానికి చెందిన నోముల యదయ్యకు మాతృదేవోభవ అనాధ ఆశ్రమం చైర్మన్ గట్టుగిరి సహకారంతో 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు,అలాగే దుప్పట్లను పంపిణీ చేయడం జరిగింది. పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న మాతృదేవో భావ అనాథ ఆశ్రమం నిర్వాహకులు గిరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల సత్యనారాయణ, రాసమల్ల బాలకృష్ణ, ఇటికల రామకృష్ణ, ఎట్టయ్య తదితరులు పాల్గొన్నారు

## రామకృష్ణ కాలనీలో గత 40 సంవత్సరాలుగా అభివృద్ధి పనులను విజయవంతంగా నిర్వహిస్తున్నాం

### రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, జనవరి 04 (ప్రభాత సూర్య) :** గత 40 సంవత్సరాలుగా రామకృష్ణ కాలనీలో వివిధ అభివృద్ధి పనులను విజయవంతంగా నిర్వహిస్తున్నామని రామకృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోగల పనిచేసే వివిధ కార్మికులకు ప్రతి సంవత్సరం శాలువాతో సన్మానించి మెమొంటో, బహుమతులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, కార్యదర్శి రామచంద్రరావు మాట్లాడుతూ రామకృష్ణ కాలనీలో గత 40 సంవత్సరాల నుంచి వివిధ ప్రభుత్వ అధికారులు, కార్మికులు ఎంతో విజయవంతంగా పనులు నిర్వహిస్తున్నారని, అలాంటి కార్మికులను మేము సన్మానించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి ప్రసాద్, చంగల్రెడ్డి, శ్రీధర్ రావు, లక్ష్మనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ, కిషోర్, పురుషోత్తం, కె.వి. రావు, రవి కిరణ్, నరేందర్ రెడ్డి, సునీల్ పటేల్, రాఘవేందర్, ప్రత్యేకంగా కిరణ్ పంతులు విచ్చేసి కేక్ కట్ చేసి కార్మికులకు అందజేశారు. ఇలాంటి కార్యక్రమము నిర్వహించడం ఈ కాలనీలో ఎంతో శుభకారణంగా ఉంటుందని కిరణ్ పంతులు తెలియజేశారు. కాలనీకి కార్మికులు మాకు బలంమని, ప్రజలు మా బలగంగా భావిస్తూ ఎంతో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న సోదరులకు, సోదరీమణులకు, కాలనీవాసులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



# మిర్యాలగూడలో కాంగ్రెస్ కు భారీ షాక్





- మున్సిపల్ ఎన్నికల వేళ హీటెక్కిన రాజకీయం
- బీఆర్ఎస్ లో ఊపందుకున్న చేరికలు
- గులాబీ తీర్థం పుచ్చుకున్న 200 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు
- బీఆర్ఎస్ తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి
- తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే
- శ్రీరామ రక్ష : నల్లమోతు సిద్దార్థ

**మిర్యాలగూడ /ప్రభాత సూర్య:** నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని భారీ షాక్ తగిలింది. ఓ వైపు అధికార పార్టీ పట్ల రోజురోజుకూ ప్రజల్లో అసంతృప్తి ఛాయలు పెరిగిపోతుండగా మరోవైపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లోనూ తీవ్ర అసహనం నెలకొంటున్నది. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు ముదిరిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అనేక మంది నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో ఇమడలేకపోతున్నారు. గత కొంతకాలంగా గ్రామాల్లో, పట్టణాల్లో బీఆర్ఎస్ పార్టీకి క్రేజ్ పెరిగింది. మార్పు కోసం కాంగ్రెస్ కు ఓటేసిన ఓటర్లలో అవగాహన పెరిగింది. రేవంత్ సర్కార్ ను గద్దె దించేందుకు సన్నద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పట్టణాల్లో రాజకీయం హీటెక్కింది. ఎన్నికల మేనిఫెస్టో లో పొందుపర్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ నేతృత్వంలో పదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షమ పథకాలపై గ్రామాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. రైతన్నను రాజును చేయాలనే ఉక్కు సంకల్పంతో కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా వంటి సంక్షమ పథకాలు యావత్ దేశానికే దిక్సూచిగా మారాయి. రేవంత్ సర్కార్ పాలనలో అన్నదాతలు యూరియా కోసం క్యూ లైన్లలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలుపొందారు. గులాబీ శ్రేణులు మరింత బలోపేతమయ్యాయి. మిర్యాలగూడ పట్టణ ఓటర్లు సైతం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకునేందుకు సన్నద్ధమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అవుతున్నది. చతెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎన్బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో 47వ వార్డు – ఇస్లాంపుర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎంఏ అలీం, ఆయన సతీమణి రుక్సానా బేగం సహా 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గులాబీ తీర్థం పుచ్చుకున్న కార్యకర్తలను నల్లమోతు సిద్దార్థ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు కే దక్కుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని నల్లమోతు సిద్దార్థ సూచించారు. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేయాలని, బీఆర్ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి అమలు చేసిన సంక్షమ పథకాల గురించి పట్టణ ప్రజల్లో అవగాహన కల్పించాలని నల్లమోతు సిద్దార్థ తెలిపారు. కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభీమోజు నాగార్జున చారి, ఎండీ మగ్దుం పాషా, ఎండీ ఇలియాస్ ఖాన్, మాజీద్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, జీడీఆర్ జాని, ఆసిం, షోయబ్, ఇమ్రాన్,మొయిద్, మునీర్, నల్లగంతుల నాగభూషణంతో పాటు పార్టిలో చేరిన గఫార్, సైదా,వెంకన్న,రఫీ బాబా, హాజీ బాబా, అమాన్, రియాన్, సాయిల్,జస్సు, జావిద్,జద్దు,షేక్ జావిద్, జాని, గంటా సైదులు, మైనారిటీ మహిళలు తదితరులు ఉన్నారు

## కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన పి.ఎ.సి చైర్మన్ అరెకపూడి గాంధీ ....



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ లో సి బ్లాక్ లో నూతనంగా నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ను కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ , ఉప్పలపాటి శ్రీకాంత్ ల తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పి. ఏ. సీ. చైర్మన్ అరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా పి. ఏ. సీ.చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని ,అసోసియేషన్ కార్యాలయం ను కాలనీ సంక్షమం ,అభివృద్ధి కోసం చక్కగా సద్వినియోగం చేసుకోవాలని పి ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. అదేవిధంగా ఆఫీస్ లో సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు , జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా నిర్మించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని ,మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధం అని ,ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి వచ్చిన పరిష్కరిస్తానని పి ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, శ్రీరామ్ నగర్ కాలనీ సి బ్లాక్ కాలనీ ని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దడం జరిగినది అని, అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరిగినది అని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరిగినది అని, శ్రీరామ్ నగర్ సి బ్లాక్ కాలనీ ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచింది అని పి ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు .శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయ షెక్తుల కృషి చేస్తానని పి ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేస్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## సందర్శకులను ఆకట్టుకుంటున్న అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ....

**మాదాపూర్ ప్రభాత సూర్య :** శిల్పారామం మాదాపూర్ లో అల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భాంగా చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నవి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం , కూచిపూడి మరియు తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నవి. లండన్ నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారులూ శ్రీ వరుణ్ శివకుమార్ గారి ప్రదర్శన యు ఎస్ కాలిఫోర్నియా నుండి విచ్చేసిన రాజేష్ చావళి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించిని. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ వారు పంపించిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్య ప్రదర్శన శ్రీ రాజన్ గారి బృందం ఎంతగానో అలరించారు. .



## యాట శేఖర్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం

**నల్గొండ -ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణ కేంద్రంలో ఆదివారం లక్ష్మి గార్డెన్ లో సన్మాన మహా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యాట శేఖర్ రెడ్డి 33 సంవత్సరాల గా అటవీ శాఖలో వివిధ హొదాలలో పనిచేసి వారు రిటర్మెంట్ పొందారు. తమ శేష జీవితం ఆనందంగా ఉండాలని ఆయువు, ఆరోగ్యాలతో, దేవుని కృపతో నిండు నూరేళ్లు జీవించాలని తోటి ఉద్యోగాలు కోరారు. ఈ కార్యక్రమంలో తోటి ఉద్యోగస్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో టంబుల్ డ్రైవ్ షాప్ ప్రారంభం నిర్వాహకులు గంట్ల ప్రవీణ్ రెడ్డి



**నల్గొండ -ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణంలో హైదరాబాద్ రోడ్డులో గల వివేకానంద నగర్ ట్రెండ్స్ షాప్ ఎదురుగా ఆదివారం నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టంబుల్ డ్రై షో రూమ్ నిర్వాహకులు గంట్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడారు నల్గొండ పట్టణ కేంద్రానికి నూతనంగా మా యొక్క ఫ్రాంచైజీని ప్రారంభించాం బాండ్రి, డ్రై క్లీన్, స్టీమ్ ఐరన్, షూస్, బ్యాగులను క్లీన్ చేయగలమని, హోమ్ డెలివరీ సౌకర్యం కూడా కలదు సరసమైన ధరలకు, నమ్మకం నాణ్యతకు మారుపేరు టంబుల్ డ్రై షోరూం అని ఈ అవకాశం పట్టణ, గ్రామీణ ప్రజలు వస్త్ర దుకాణ వ్యాపారస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## జనవరి 25ఉ28 వరకు హైదరాబాదులో నిర్వహణ.. ఐద్వా జిల్లా కార్యదర్శి నాయిని లలిత





హైదరాబాద్‌లో జనవరి 25 నుంచి 28 వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఘనంగా నిర్వహించబడుతున్నా యని ఐద్వా జిల్లా కార్యదర్శి నాయిని లలిత తెలిపారు. ఈ మహాసభలను మహిళలు, ప్రజాస్వామ్య వాదు లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేడు మహాసభల జయప్రదంకోసం విరాళాల సేకరణ చేయడం జరిగింది. అనంతరం లలిత మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు ఈ నాలుగు రోజుల జాతీయ మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలపై విస్తృత చర్చ జరగనుందని, భవిష్యత్ మహిళా ఉద్యమాలకు దిశాని ర్దేశం చేసే కార్యాచరణరూపుదిద్దుకోనుందని అన్నారు. ఐద్వా సంస్థ మహిళల సమాన హక్కులు, విద్య, బాల్యవివాహాల నిషేధం, ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధానికి ఐపీసీ 498ఎ సెక్షన్, కేంద్ర,రాష్ట్ర మహిళా కమిషన్లు, గృహహింస నిరోధక చట్టం, పనిచోట్ల లైంగిక వేధింపుల నిరోధక చట్టం, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు వంటి అనేక కీలక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేసి సాధించిందని లలిత గుర్తు చేశారు. జిల్లాలో మహిళలపై అత్యాచారాలు, దాడులకు వ్యతిరేకిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనలు చేశామన్నారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ బిల్లును సాధించేందుకు సుదీర్ఘ పోరాటాలు కొనసాగిస్తూనే, అధికారంలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించే ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో, సంస్కృతిలో మహిళలపై జరుగుతున్న అణచివేతను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగే ఈ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు వేలాదిగా మహిళలు, ప్రజలు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కోశాధికారి మమత, జిల్లా కమిటీ సభ్యురాలు మల్లీశ్వరి, షబానా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.





## హత్నూర సర్పంచి, ఉప సర్పంచులకు ఘన సన్మానం..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రం సర్పంచి నల్లోల్ల ఎల్లయ్య,ఉపసర్పంచి చెక్క మానస రవీందర్గౌడ్ తోపాటు వార్డు సభ్యులను కళాకారుల సంఘం అధ్యక్షుడు పరమేశుల కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి నల్లోల్ల ఎల్లయ్య మాట్లాడుతూ కళాకారుల సంఘం అధ్యక్షుడు పరమేశుల కృష్ణ ఆధ్వర్యంలో తనను తనతోపాటు పంచాయతీ పాలక వర్గాన్ని సన్మానించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. హత్నూర గ్రామ ప్రజలు తన మీద నమ్మకంతో తనను సర్పంచిగా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు, విద్యావంతులకు, ఉద్యోగస్తులకు, యువకులకు, హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా అన్నారు. గ్రామానికి అవసరమైన నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా అన్నారు. స్తానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మరెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కె.మల్లేశం,కే.శ్రీనివాస్, ఎన్.రామదాసు,కే. మాణయ్య, దుర్గయ్యా,బి.స్వామి,పి. కృష్ణ కళాకారుల సంఘం అధ్యక్షుడు,బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు, శివ శంకర్ రావు,పండుగ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆందోల్ నిర్మల దేవి పదవీ విరమణ మహోత్సవం



**నల్గొండ -ప్రభాత సూర్య :** నల్గొండ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో గల మనోరమ హోటల్లో ఏర్పాటుచేసిన పదవీ విరమణ కార్యక్రమంలో ఆదివారం పదవి విరమణ మహోత్సవ కార్యక్రమాన్ని చేశారు. అందోల్ నిర్మల దేవి గత 33 సంవత్సరాలు గ్రంథాలయంలో వివిధ స్థాయిలో పనిచేసి అధికారుల మన్నలు పొంది, గత సంవత్సరం 31/12/2025 గురువారం నాడు రిటైర్మెంట్ పొందారు. పేదరికంలో జన్మించి మా తల్లిదండ్రుల ఆశీర్వాదంతో ఈ స్థాయికి వచ్చానని కష్టసుఖాలు పాలుపంచుకొని తమ శేష జీవితం సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తానని, చంద్ర రేఖ మాట్లాడుతూ తన తల్లి గారు తమ శేష జీవితం ఆనందంగా, ఆయు ఆరోగ్యాలతో గడపాలని పదవీ విరమణ కార్యక్రమంలో మా తండ్రిగారు లేనందున బాధగా ఉందని తెలిపారు. పదవీ విరమణ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూతురు చంద్రరేఖ, దైనిక్, హేమంత్ కుమార్ మౌనిక ఆర్యన్, బంధుమిత్రులు, గ్రంథాలయ ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ పట్టణంలో రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా వాహనాల తనిఖీ




నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04:** రోడ్ సేఫ్టీ మంత్‌లో భాగంగా ఆదివారం నర్సాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో వాహన తనిఖీలు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడమైనది. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేస్తూ, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, ఇతర అనర్థాలను వివరించడమైనది. హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్లు కలిగి ఉన్న వాహనదారులనుప్రోత్సహించేందుకు సన్మానించడమైనది. అలాగే నాలుగు చక్రాల వాహనదారుల్లో సీట్ బెల్ట్ ధరించి ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, అవసరమైన అన్ని డాక్యుమెంట్లు కలిగి ఉన్న వారిని సన్మానించడమైనది. డాక్యుమెంట్లు లేని వాహనదారులకు, సీట్ బెల్ట్ ధరించని వారికి, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, అనర్థాలపై అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను నివారించడమే ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించడమైనది. వాహనదారులు అందరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తుందని నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు.

## జనవరి 6న జిల్లాకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన :జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ఈ నెల 6న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జనవరి 6న ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరి, ఉదయం 10.30 గంటలకు కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చేరుకుని బ్యాగరి రాములుకు నష్టపరిహారాన్ని పంపిణీచేస్తారనీ,అనంతరం ఉదయం 11.00 గంటలకు జహీరాబాద్ మండలం రంజోల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ జూనియర్ కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. తదుపరి సంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకుని, మధ్యాహ్నం 2.00 గంటలకు జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, సమావేశంలో భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన ఆర్ఓఆర్ అమలు, బ్యాక్లాగ్ ఖాళీలు తదితర అంశాలపై సమీక్షంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, డీసీఓలు, ఆర్సీఓలు, సంగారెడ్డి మరియు జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

## రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లకు కంటి పరీక్షలు

### పలు డిపోలలో 393 మంది డ్రైవర్లకు పరీక్షలు






**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04:** రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా ఆదివారం జిల్లా రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ఆర్టీసీ బస్ డిపోలలో డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించారు. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, బిహెచ్ఎల్ ఆర్టీసీ బస్ డిపోలలో ఏర్పాటు చేసిన ఈ కంటి పరీక్ష శిబిరాలలో మొత్తం 393 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు తెలిపారు. సంగారెడ్డి డిపోలో 111 మంది డ్రైవర్లు,జహీరాబాద్ డిపోలో 123మంది,నారాయణఖేడ్ డిపోలో 93 మంది,బిహెచ్ఎల్ డిపోలో 66 మంది ఆర్టీసీ డ్రైవర్లకు రవాణా శాఖ అధికారులు, ఆయా ఆర్టీసీ డిపో మేనేజర్ల పూర్తి పర్యవేక్షణలో వైద్య బృందం డ్రైవర్లకు సమగ్రంగా కంటి పరీక్షలు నిర్వహించిందని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్యం మెరుగుపడటం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ఇది దోహదపడుతుందని జిల్లా రవాణా అధికారి అరుణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి అరుణ, ఆర్టీసీ ఆర్ ఎం, ఆయా డిపో మేనేజర్లు, వైద్యులు, నర్సులు, ఆర్ టి ఏ సిబ్బంది చందన్, స్రవంతి, నరేందర్, గౌతమ్ రాజ్, వెంకటేష్, గౌతమ్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతి అందుచేత....




**చందానగర్ ప్రభాత సూర్య :** రాష్ట్ర స్థాయి మాస్టర్స్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా రన్నర్ ప్ గా నిలిచి రెండో స్థానంలో నిలవడం పట్ల రంగారెడ్డి జిల్లా ఆద్యక్షుడు కొండ విజయ్ కుమార్ పథక ల విజేతలకు అభినందనలు తెలిపారు. ఆదివారం చందానగర్ లోని భావ్యం బ్లాంకెట్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో పోటీల్లో పాల్గొని పథకాలు సాదించిన పథకాల విజేతలకు సన్మానం తో పాటు నగదు బహుమతి ని అందచేశారు . కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆద్యక్షుడు మర్రి లక్ష్మరెడ్డి, కొండ విజయ్ కుమార్ లు మాట్లాడుతూ మాస్టర్ ఆథ్లెట్ పోటీల్లో గత 3 సంవత్సరాలుగా రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడం అభీనందనీయమని పేర్కొన్నారు, హెూప్ ఫౌండేషన్ ద్వారా పథకాల విజేతలకు నగదును అందచేశారు. రంగారెడ్డి జిల్లా నుండి 29 బంగారు , 23 సిల్వర్ , 19 బ్రౌంజ్ పథకాలను సాదించారు. ఈ కార్యక్రమంలో చెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి ప్రభు కుమార్, జిల్లా ఆద్యక్షుడు నూనె సురేందర్, కార్యదర్శి స్వాతిగౌడ్ , ట్రెజరర్ శివలీల రెడ్డి , లక్ష్మ , భగవాన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సమాజ సేవకుల పుట్టిన రోజు వేడుకలు

**సూర్యాపేట టౌన్/ప్రభాత సూర్య:** ఒకరేమో రాజకీయ దురంధరులు,మరొకరేమో సామాజిక సేవకులు..వారే గండూరి కృపాకర్, గుండా వెంకన్న లు. గండూరి కృపాకర్ రాజకీయాల్లో రాణిస్తుండ గా మరొకరేమో సుమన్ యువ సేన ద్వారా వేసవి లో ప్రజల దాహార్తిని తీర్చుతూ సంఘ సేవలో సేవలు అందిస్తున్నారు. వీరిద్దరి జన్మదిన వేడుకలు ఒకే రోజు కావడం తో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్లూస్ సి కేఫ్ లో మిత్రులు, ఆత్మీయుల సమక్షంలో కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. శాలువా,బోకెలతో శుభాకాంక్షలు తెలిపి బాణా సంచా కాల్చి పండుగ వాతావరణం లో వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో మిత్రులు, శ్రేయోభిలాషులు గోపారపు రాజు, పోతుగంటి వెంకటేశ్వర్లు, బోనగిరి విజయ్ కుమార్, గుడిపాటి రమేష్,బ్లూసీ జానీ, బిక్కుమల్ల సంతోష్ ,మొరిశెట్టి రాము, బజ్జూరు శ్రీనివాసు, బెజగం ఫణి,రాచకొండ శ్రీనివాస్, పాలవరపు నరసింహారావు,పాలవరపు రాజేష్, కర్నాటి నరసింహ రావు, పోలిశెట్టి హరిశంకర్, నాతాల వెంకట రెడ్డి ,గుండా శ్రీనివాసు, వెంపటి శబరి నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వెనుజులపై అమెరికన్ దాడిని ఖండించండి ..







**ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి...**

**ఇందన నిక్షపల కోసమే దాడి,...**

**సీఐటీయూ కోశాధికారి కే రాజయ్య .**

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04:** ఆదివారం పటాన్చెరులోని శ్రామిక్ భవన్ నుంచి జాతీయ రహదారి వరకు కొత్త వెనుజులపై అమెరికన్ దాడినీ నిరసిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా సిఐటీయూ జిల్లా కోశాధికారి కే రాజయ్య మాట్లాడుతూ వెనిజులపై దాడిని ప్రపంచం మొత్తం ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒక దేశం పై అమెరికా పెత్తనం ఏమిటి అని ప్రశ్నించారు, టెర్రరిస్టుల కంటే భయంకరంగా అమెరికన్ సైన్యం వివరించిందని ఆయన అన్నారు. ఒక దేశ అధ్యక్షుడు భవనంపై రాత్రిపూట దాడి చేసే ప్రజల ప్రాణాలు తీసి అధ్యక్షని అతని భార్యని కిడ్నాప్ చేయడం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. అమెరికాకు ఎవరు హక్కు ఇచ్చారని ఆయన అన్నారు. దీనిని అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాలని ఆయన అన్నారు . అమెరికన్ సామ్రాజవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన అన్నారు. గత అనేక సంవత్సరాల నుంచి వెనుజుల దేశాన్ని స్వాధీనం చేసుకోవాలని, తమ చెప్పు చేతిలో ఉంచుకోవాలని అమెరికా కోరుకున్నదని ఆయన అన్నారు. వెనుజులలో ప్రపంచంలోనే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న దేశమని, అది ప్రజా ప్రభుత్వమని ప్రజల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నాను ఆయన అన్నారు, వెనిజులలో ఇంధన నిక్షపాలు గనినీయంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఇంధనం పైన పెత్తనం కోసమే అమెరికన్ దాడి చేసిందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు వెనుజుల అధ్యక్షలు భార్య ఎక్కడ ఉందో కూడా ప్రకటన చేయలేదని ఆయన అన్నారు. ఆయన భార్యను వెంటనే మీడియాకు చూపించాలని డిమాండ్ చేశారు. వెనిజుల నుంచి అమెరికన్ సైన్యం వెంటనే వెనుకకు పోవాలని ఆయన అన్నారు. అమెరికన్ దానిని భారత దేశ ప్రజలందరూ సంఘాలు పార్టీలు ఖండించాలని పోరాటనికి ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షడు నాగేశ్వరరావు, నాయకులు శ్రీనివాస్, రామకృష్ణ, సాయన్న, నరసింహారెడ్డి, నరసింహులు, నారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహ రెడ్డి నియామకం

- తొలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గుర్తింపు...
- చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తొలి ఏజీపీగా నియామకం...
- కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రం...



**చౌటుప్పల్.జనవరి 04. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహారెడ్డిని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆయన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. చౌటుప్పల్ మండలం,పెద్ద కొండూరు గ్రామ పరిధికి చెందిన వాకిటి నరసింహారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో న్యాయవిద్యను పూర్తి చేసారు.2010 సంవత్సరంలో తెలంగాణ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా నమోదు చేసుకొని 2010 సంవత్సరం నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. న్యాయవాదిగా తొలిసారి రంగారెడ్డి జిల్లా కోర్టులో తన ప్రాక్టీస్ ను మొదలు పెట్టారు.అనంతరం 2021 లో తొలిసారి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేసినప్పటి నుండి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ తెలంగాణ బార్ కౌన్సిల్లో గుర్తింపు పొందిన తర్వాత జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షనిగా తాను గెలుపొంది తన సేవలను అందించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన వాకిటి నరసింహారెడ్డి మాట్లాడుతూ... తనను ప్రభుత్వం న్యాయవాదిగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.తాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చౌటుప్పల్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది అవసరాన్ని గుర్తిస్తూ ఏర్పాటు చేయాలని అప్పటి న్యాయశాఖ కార్యదర్శికి పలుమార్లు వినతి పత్రాలు ఇవ్వటం జరిగిందని గుర్తు చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్ కోర్టుకు మొదటి ప్రభుత్వ న్యాయవాదిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా వాకిటి నరసింహారెడ్డి నియామకం పట్ల తోటి న్యాయవాదులు,పట్టణ పుర ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భాష్యం విద్యార్థి కి క్యారమ్స్ టోర్నమెంట్ లో ద్వితీయ బహుమతి

**తొమ్మిదవ తరగతి విద్యార్థి దాదె అనంత హరినాద్**

**విజేతలకు యాజమాన్యం ప్రశంస**




**కూకట్ పల్లి, జనవరి 04 (ప్రభాత సూర్య) :** తెలంగాణ రాష్ట్ర గ్రేటర్ హైదరాబాద్ భాష్యం విద్యా సంస్థల మూడు జోన్ ల పరిధిలో మహేశ్వరంలో నిర్వహించిన విద్యార్థులు క్రీడల పోటీలు పాఠశాల యాజమాన్యం ఈ క్రీడల పోటీలలో భాగంగా జోన్1 ఎస్ఆర్ నగర్ స్కూల్ బ్రాంచ్ నుండి క్యారమ్స్, కోకో, కబడ్డీ, వాలిబల్, చెస్, రన్నింగ్ పలు పోటీలలో మొదటి బహుమతి విజేతలుగా నిలిచారు. ప్రధానంగా క్యారమ్స్ ఆటల పోటీలో పాఠశాల విద్యార్థి దాదె అనంత హరినాద్ విజేతగా నిలిచి రెండవ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ భాష్యం పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబరచిన తొమ్మిదవ తరగతి చదువుతున్న దాదె అనంత హరినాద్ క్యారమ్స్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచి రెండవ బహుమతి సాధించం అద్వితీయ ప్రదర్శన అని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ముఖ్యంగా మంచి నిష్ణాతులైన అనుభవం ఉన్న కోచింగ్ తీసుకుని జాతీయ స్థాయి క్రీడాకారుడిగా చెస్ పోటీలో మెరుగైన ప్రదర్శనతో రాణించి, చదువులో మంచి ఫలితాలు సాధిస్తూ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా జెడ్ఈఓ శిరీష మేడం, ప్రిన్సిపాల్ కి, పీటీలు ఎం రాజు, జె శేఖర్ లకు అనంత హరినాద్ తల్లి తండ్రులు అభినందనలు తెలిపారు.



## బిజెపి ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి జనవరి 04:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు ఐబీ గెస్ట్ హౌజ్‌లో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గం ముఖ్య నేతల సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు. అనంతరం పాలమూరు, కృష్ణా జలాలపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రఘునందన్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర శాసనసభ లో పాలమూరు, కృష్ణా జలాలపై చిత్తశుద్ధితో చర్చ జరగడం లేదని విమర్శించారు. అసెంబ్లీ వేదికగా ఒకరినొకరు తిట్టుకోవడానికే అధికార, ప్రతిపక్షలు పరిమితమయ్యాయని అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా జలాల విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ ఢిల్లీలో సంతకాలు చేసిన పత్రాలను ప్రజల ముందుంచామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారునిగా కేసీఆర్ ఎంత టీఎంసీలు సరిపోతాయో అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు.పాలమూరు జిల్లా వలసల జిల్లాగా మారినా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గానీ, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గానీ ఎలాంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి ఏదో చేస్తాడని ఆశించిన ప్రజలకు నిరాశే గిలిందన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకు విజన్ లేదని, నాణానికి బొమ్మఉబొడుసులా మారాయని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో మంత్రులు, ప్రతిపక్ష నేతలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు.ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని అనే లక్ష్యంతో బీజేపీ నదుల అనుసం ధాన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టిందని తెలిపారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అవినీతి ఆరోపణలకే పరిమితమయ్యారని అన్నారు.పాలమూరు ప్రజలను రెండు పార్టీల సీఎంలు మోసం చేశారని ఆరోపించారు. అసెంబ్లీలో సరైన సంఖ్యలో ఎమ్మెల్యేలు లేకపోవడం విడ్డూరమన్నారు. వ్యక్తిగత దూషణలను కట్ చేసి, సబ్జెక్ట్‌పై మాత్రమే చర్చ జరపాలని డిమాండ్ చేశారు.రెండేళ్ల తర్వాత రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, పాలమూరు ప్రజలకు న్యాయం చేసేది బీజేపీ మాత్రమేనని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.



## సంస్థాన్ నారాయణపురం గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచుతా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, జనవరి 04(ప్రభాత సూర్య):** మునుగోడు పర్యటనలో భాగంగా సంస్థాన్ నారాయణపురం గ్రామసభ నిర్వహిస్తున్నటువంటి సందర్భములో నారాయణ పురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, గ్రామ ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి పాలకవర్గం అధికారులతో మాట్లాడి గ్రామానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దార్థ




**మిర్యాలగూడ /ప్రభాత సూర్య :** మిర్యాలగూడ మండలంలోనీ గూడూరు గ్రామ పరిధిలోని శ్రీనిధి వెంచర్ లో వింజం రాజేంద్రప్రసాద్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ పాల్గొన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ దంపతులకు యువనేత నల్లమోతు సిద్దార్థ శుభాకాంక్షలు తెలిపారు. యువనేత నల్లమోతు సిద్దార్థ వెంట శాఖపురం గ్రామ సర్పంచ్ చేకూరి సూర్యనారాయణ, వింజం శ్రీధర్, కూనాల గోపాలకృష్ణ, రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**గట్టుప్పల ప్రభత సూర్య జనవరి 4:** ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ని మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో గట్టుప్పల కాంగ్రెస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మేడారం సమ్మక్క సారలమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే కి మంత్రి పదవి రావాలని ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదం మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చెరుపల్లి ఆంజనేయులు ఎమ్మెల్యే కు అందజేశారు. కలిసిన వారిలో సర్పంచ్ నామని జగన్నాథం, ఉప సర్పంచ్ ఖమ్మం లక్ష్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షలు సామల యాదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు నామనీ బుచ్చయ్య మాధగాని సత్తయ్య , చెరుపల్లి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు





## క్యాలెండర్ ఆవిష్కరణ - బండార్ దత్తాత్రేయ

**నల్గొండ -ప్రభాత సూర్య:** సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ 2026 క్యాలెండర్ ను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. హైదరాబాద్లో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్, జలసాధన సమితి అధ్యక్షులు దుష్యర్ల సత్యనారాయణ, బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మ ల తో కలిసి క్యాలెండరు ఆవిష్కరించారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ తమ సంస్థ సమాచార హక్కు చట్టం పై, ఓటరు చైతన్యం పై విసృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నామని చెప్పారు. ఈ సంవత్సరం కూడా క్షత్ర స్థాయి నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, అనధికారులకు, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యులకు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నోముల శంకర్ యాదవ్, రాజ్ కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు

## ఇది గ్రాఫిక్స్ కాదు.. నిజంగా రోబోనే!



సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో గాల్లోకి ఎగిరి విన్యాసాలు చేసే రోబోలు నిజ జీవితంలోకి వచ్చేస్తున్నాయి. 'టెర్మినేటర్' సినిమాలో విధ్వంసం సృష్టించిన 'టీ800' గుర్తుండే ఉంటుంది కదా! సరిగ్గా అదే పేరుతో చైనా కొత్త రోబో తయారు చేసింది. అయితే టెర్మినేటర్లో మాదిరి విధ్వంసం సృష్టించేదిగా కాకుండా, మానవాళికి సహాయపడేలా చైనాకు చెందిన రోబోటిక్స్ సంస్థ 'ఇంజిన్ ఏఐ' హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేసింది. ఇటీవల జరిగిన ఓ ప్రదర్శనలో ఈ రోబో చేసిన కుంగ్ ఫూ విన్యాసాలు ఆశ్చర్యపరిచాయి.

**సాహసోపేత అడుగు**

2023లో స్థాపించిన ఈ ఇంజిన్ఏఐ స్టార్టప్ కంపెనీ తక్కువ సమయంలోనే రోబోటిక్స్ రంగంలో సంచలనం సృష్టించింది. 'బోర్న్ టు సబ్వర్ట్' (వ్యవస్థను మార్చడానికే పుట్టింది) అనే నినాదంతో వస్తున్న %ు%800 లైవ్ డెమోల్లో హై-కిక్స్, స్పారింగ్ మూమెంట్స్తో ప్రేక్షకులను ఎంతో ఆకర్షిస్తోంది. దీని చురుకుదనం చూసిన చాలామందికి ఇది అసలైన రోబోనా లేక కంప్యూటర్ గ్రాఫిక్సా అనే సందేహం కలగకమానదని కొందరు చెబుతున్నారు. విమర్శలకు సమాధానంగా కంపెనీ మేకింగ్ వీడియోలను విడుదల చేసింది. సీఈఓ జావో టోంగ్యాంగ్ స్వయంగా ఆ రోబోతో తలపడిన వీడియోను సైతం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. టీ800ని అత్యంత నాణ్యమైన ప్రమాణాలతో రూపొందించినట్లు కంపెనీ చెప్పింది. 1.73 మీటర్ల ఎత్తు, 75 కిలోల బరువు ఉండే ఈ రోబోను ఏరోస్పేస్ గ్రేడ్ మెగ్నీషియం-అల్యూమినియం మిశ్రమంతో తయారు చేసినట్లు పేర్కొంది. 450 ఎన్ఎం టార్క్ కీళ్ల సామర్థ్యంతో ఇది అథ్లెట్ల తరహాలో కదలగలదని చెప్పింది. ఇది ఒక్కో చేతిలో 5 కిలోల వరకు వస్తువులను సులువుగా లేపగలదు. ఈ రోబోలో అధికంగా వేడి జనరేట్ అవ్వకుండా ఉండటానికి అధునాతన కూలింగ్ సిస్టమ్ కూడా ఉంది. నాలుగు గంటల పాటు నిరంతరాయంగా పనిచేసేలా మాడ్యులర్ సాలిడ్-స్టేట్ బ్యాటరీని ఇందులో అమర్చినట్లు కంపెనీ తెలిపింది.

**ఏఐ సూపర్ పవర్**

ఈ రోబోలో ఎన్వీడియా ఏజీక్స్ ఓరిన్ మాడ్యూల్, ఇంటెల్ N97 సీపీయూలున్నాయి. ఇవి 275 TOPS (Trillions of Operations Per Second) శక్తిని అందిస్తాయి. 360 డిగ్రీల వ్యూతో తన పరిసరాలను మిల్లీసెకన్లలో అర్థం చేసుకుని అడ్డంకులను అధిగమిస్తుంది.

# పంటలు సాగు చేసిన రైతులకే రైతు భరోసా

## శాటిలైట్ సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉ ప్రభుత్వ కీలక నిర్ణయం

**సూర్యాపేట/ ప్రభాత సూర్య:** తెలంగాణ రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు అమలులో ఉన్న రైతు భరోసా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇకపై నిజంగా పంటలు సాగు చేసిన రైతులకే రైతు భరోసా సహాయం అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ధరణి పోర్టల్లో నమోదైన వ్యవసాయ భూములు కలిగిన రైతులకు ఎకరాకు సంవత్సరానికి రూ. 12,000ను రెండు విడతల్లో రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం అందిస్తోంది. గత సంవత్సరం జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో మార్పులు చేసి రైతు భరోసాను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఎకరాకు సంవత్సరానికి రూ. 10,000 రెండు విడతల్లో అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఎకరాకు రెండు విడతల్లో రూ. 12,000ను రైతులకు అందిస్తున్నారు. వానాకాలం సీజన్కు ముందు ఎకరాకు రూ. 6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటికే ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం, బీడు భూములు, రాళ్లు, గుట్టలు ఉన్న భూములకు పెట్టుబడి సహాయం నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో యాసంగి సీజన్ నుంచి శాటిలైట్ ఆధారిత పంటల సర్వే నిర్వహించి, వాస్తవంగా సాగు చేసిన భూములను మాత్రమే గుర్తించనున్నారు. శాటిలైట్ ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా వ్యవసాయ అధికారులు ధ్రువీకరణ చేసి, పంటలు సాగు చేసిన రైతులకే రైతు భరోసా నిధులు జమ చేయనున్నారు.




**కొత్తగా రైతు భరోసాకు దరఖాస్తు విధానం**

రైతు భరోసా పథకానికి కొత్త దరఖాస్తులు ఆన్లైన్లో అందుబాటులో లేవు. రైతులు తమ మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి లేదా క్లస్టర్ వ్యవసాయ అధికారికి ఆఫ్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంలో మొబైల్ నంబర్, భూమి వివరాలు నమోదు చేసి, అవసరమైన పత్రాలు జత చేయాలి. అధికారులు పరిశీలించి ధ్రువీకరించిన అనంతరం లబ్ధిదారుల జాబితాలో చేర్చుతారు.

**అవసరమైన పత్రాలు**

**పట్టాదారు పాస్బుక్ జెరాక్స్**

**ఆధార్ కార్డు జెరాక్స్**

**బ్యాంకు పాస్బుక్ జెరాక్స్**

**పూర్తిగా నింపిన దరఖాస్తు ఫారం**

**ఈ కొత్త విధానంతో నిజమైన రైతులకు న్యాయం జరిగేలా, ప్రభుత్వ నిధులు సరైన దిశలో వినియోగం కావాలని ప్రభుత్వం ఆశిస్తోంది.**

# ఇళ్ల ధరలు 5 శాతం అప్

### వచ్చే ఏడాదిపై మెజారిటీ రియల్టర్ల అంచనా

### క్రెడాయ్%-%సీఆర్ఈ మ్యాట్రిక్స్ సర్వే

**న్యూఢిల్లీ:** గృహాల కొనుగోలుకు పటిష్టమైన డిమాండ్ నెలకొనడంతో వచ్చే ఏడాదిలో (2026) ఇళ్ల ధరలు మరింతగా పెరగనున్నాయి. ఈ పెరుగుదల 5 శాతం పైగా ఉంటుందని దాదాపు 70 శాతం రియల్ ఎస్టేట్ డెవలపర్లు అంచనా వేస్తున్నారు. రియల్టర్ల సమాఖ్య క్రెడాయ్, రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ సీఆర్ఈ మ్యాట్రిక్స్ చేపట్టిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. నవంబర్, డిసెంబర్ మధ్య నిర్వహించిన ఈ సర్వేలో 647 మంది డెవలపర్లు పాల్గొన్నారు. క్రెడాయ్ సదస్సులో ఈ నివేదికను విడుదల చేశారు. దీని ప్రకారం వచ్చే క్యాలెండర్ సంవత్సరంలో ఇళ్ల ధరలు 5 శాతానికి మించి పెరుగుతాయని 68 శాతం మంది అభిప్రాయపడ్డారు. పెరుగుదల 25 శాతానికి మించి ఉంటుందని 1 శాతం మంది, 15%-%25 శాతం మధ్య ఉంటుందని 3 శాతం మంది అంచనా వేశారు. ఇక ఇళ్ల ధరలు 10%-%15 శాతం మధ్యలో పెరుగుతాయని 18 శాతం మంది, 5%-%10 శాతం మేర పెరుగుతాయని 46 శాతం మంది పేర్కొన్నారు.



రేట్లు తగ్గుతాయని 8 శాతం మంది మాత్రమే తెలపగా, ధరల పెరుగుదల 5 శాతం లోపే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు సుమారు 25 శాతం మంది వివరించారు.

**స్పెక్యులేషన్ కన్నా డిమాండ్కే ప్రాధాన్యం..**

2026 క్యాలెండర్ సంవత్సరంలో రెసిడెన్షియల్ సెగ్మెంట్ సానుకూలంగా ఉంటుందని మూడింట రెండొంతుల మంది డెవలపర్లు అంచనా వేస్తున్నారు. గృహాలకు డిమాండ్ 5 శాతం మేర పెరుగుతుందని భావిస్తున్నారు. వచ్చే ఏడాది రియల్ ఎస్టేట్ రంగ వృద్ధి ప్రధానంగా వినియోగదారుల డిమాండ్ను బట్టే ఉంటుందే తప్ప స్పెక్యులేషన్ ఆధారితమైనదిగా ఉండదని క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ జి. పటేల్ తెలిపారు. టెక్నాలజీ వినియోగంతో ఖర్చులను తగ్గించి, కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రాపర్టీలను అందించడంపై పరిశ్రమ మరింతగా దృష్టి పెడుతోందని వివరించారు. ఈ వృద్ధి గతిని నిలబెట్టుకోవాలంటే వేగవంతమైన అనుమతులు, రెగ్యులేటరీపరంగా మరింత స్పష్టత అవసరమవుతుందని పటేల్ వివరించారు. క్లియరెన్స్లను క్రమబద్ధీకరిస్తే వివిధ మార్కెట్లవ్యాప్తంగా కొత్త గృహాల సరఫరా పెరుగుతుందని, సకాలంలో ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. అలాగే, పట్టణ ప్రాంతాలు పర్యావరణహితంగా, సమంగా అభివృద్ధి చెందగలవని చెప్పారు. డిమాండ్ స్థిరంగా ఉండబోతోందని, ఒక పద్ధతి ప్రకారమే కొత్త గృహాల సరఫరా పెరగబోతోందని నివేదిక తెలియజేస్తోందని సీఆర్ఈ మ్యాట్రిక్స్ సీఈవో అభిషేక్ కిరణ్ గుప్తా తెలిపారు.

# 2026లో సంపద సృష్టించే 'టాప్-4' థీమ్స్ ఇవే!

2025లో భారత స్టాక్ మార్కెట్ కొంత ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, 2026వ సంవత్సరం ఇన్వెస్టర్ల పాలిట వరంగా మారబోతోందని మార్కెట్ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్ల తగ్గింపు, భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి, కార్పొరేట్ లాభాలు పుంజుకోనుండటం మార్కెట్కు కొత్త ఊపిరి పోయనున్నాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నిఫ్టీ-50 ఇండెక్స్ 2026 చివరి నాటికి 28,000 పాయింట్ల మైలురాయిని చేరుకోవచ్చని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, కేవలం సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా.. కృత్రిమ మేధ(%ూ×%), గ్రీన్ ఎనర్జీ వంటి భవిష్యత్తు అవసరాలను గుర్తించి పెట్టుబడి పెట్టే వారికి దీర్ఘకాలికంగా భారీ లాభాలు అందనున్నాయని చెబుతున్నాయి. మరి 2026లో మదుపరుల అదృష్టాన్ని మార్చబోతున్న ఆ కీలక రంగాలు ఏమిటో చూద్దాం.

**కృత్రిమ మేధ**

భారతదేశం ప్రస్తుతం ఏఐ విప్లవంలో ఒక కీలక దశలో ఉంది. ఇది కేవలం సాఫ్ట్వేర్ సేవలకే పరిమితం కాకుండా, ఉత్పాదకతను పెంచే ప్రధాన సాధనంగా మారుతోంది. అమెజాన్, మెటా, గూగుల్ వంటి గ్లోబల్ దిగ్గజాలు సుమారు 90 బిలియన్ డాలర్ల పెట్టుబడులను భారత్లో ఏఐ మౌలిక సదుపాయాల కోసం కేటాయించాయి. 2026 ఫిబ్రవరి 19-20 తేదీల్లో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ఈ రంగానికి దిశానిర్దేశం చేయనుంది. భారత ప్రభుత్వ లక్ష్యం ప్రకారం, స్వదేశీ అవసరాలకు తగ్గట్టుగా ఉత్పాదకతను పెంచే 'చిన్న మోడల్స్'(%ాఝశ్రీశ్రీ ాఝఅస్త్రఝుస్త్రవ వీశీసవశ్రీం%) అభివృద్ధిపై దృష్టి సారించింది.



**ఈవీ చార్జింగ్ సదుపాయాలు**

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరుగుతున్నా, వాటికి అవసరమైన చార్జింగ్ సౌకర్యాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. 45 శాతం మంది ఈవీ వినియోగదారులు పబ్లిక్ చార్జింగ్ పాయింట్లపై ఆధారపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ భారీ అంతరాన్ని పూడ్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ సబ్సిడీలను అందిస్తున్నాయి. ప్రైవేట్ రంగంలో ఈ మేరకు సర్వీసులు అందిస్తున్న కంపెనీలు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉంది.

**ఆఫీస్ వర్క్స్పేస్**

భారతదేశం ఇప్పుడు కేవలం బ్యాక్ ఆఫీస్ హబ్గా కాదు.. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (%+జజ%) కంపెనీల వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. అంతర్జాతీయ కంపెనీలు తమ రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్, ఇన్నోవేషన్ సెంటర్లను భారత్లో ఏర్పాటు చేస్తున్నాయి. దీనివల్ల అత్యాధునిక సౌకర్యాలు గల 50-100 సీటర్ ఆఫీసులకు, మీటింగ్ రూమ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.